క్లుప్తంగా

బీసీ సమస్యలపై మంత్రి గంగులకు వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు రాజేశ్వర్‌యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. బీసీ విద్యార్థుల స్కాలర్‌షిప్ కోసం రూ.5వేల కోట్లు విడుదల చేయాలని, బీసీబంధు ద్వారా పేదవారికి లక్షరూపాయలు ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. సంఘం ప్రధాన కార్యదర్శి రవికుమార్‌చారి, కార్యదర్శి రవీందర్‌యాదవ్, హేమంత్, కృష్ణ, సాయివర్ధన్ తదితరులున్నారు.

డాక్టర్ నీలా శ్రీధర్‌కు సత్కారం

కాచిగూడ: నిత్యం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్న అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవీ ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్‌ను మంగళవారం హైదరాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం కోశాధికారి లింగా ప్రకాష్, నల్లకుంట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, డాక్టర్ మురళీధర్, అల్లాడి శ్రీనివాస్, మారం సురేష్‌బాబు ఘనంగా సత్కరించి అభినందించారు.

ఘనంగా పోషణ మాసం మహోత్సవం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా పోషణ మాసం మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషణ విలువలు గల ఆహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. సీడీపీఓ జయశ్రీ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంగీత, టీచర్లు శైలజ, ప్రేమలత, మంగతాయారు, ఉమ, శశికళ తదితరులున్నారు.

సిద్దిపేట్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్‌గా శ్రీనివాస్‌రెడ్డి

అంబర్‌పేట: బీజేపీ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జిగా అంబర్‌పేట డీడీ కాలనీకి చెందిన డాక్టర్ ఓ. శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. బీజేపీ రాష్ట్ర శిక్షణ కమిటీ చైర్మన్‌గా ఉన్న ఆయనకు అదిష్టానం అదనపు బాధ్యతలను రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మంగళవారం అప్పగించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో పార్టీని గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

అక్కినేని అవార్డు ప్రదానం

చిక్కడపల్లి: అనురాగ దాంపత్యానికి సౌందర్యం అక్కినేని అన్నపూర్ణ దంపతులు కాగా.. వారి పేరిట ప్రముఖులకు అవార్డులు ఇవ్వడం విశేషమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మంగళవారం రాత్రి అక్కినేని అన్నపూర్ణ దంపతుల పేరిట ఆదర్శ వంతులు అవార్డులను తనికెళ్ల భరణి, దుర్గా భవాని, ప్రదీప్, సరస్వతి దంపతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బహుకరించారు. తొలుత మిత్రా, సురేఖ, శశికళలు పాడిన పాటలు సభికులను అలరించాయి.

ట్రాఫిక్ జామ్

ట్యాంక్‌బండ్‌పై ఇబ్బందిపడ్డ వాహనదారులు

ముషీరాబాద్: ట్యాంక్‌బండ్ మీదుగా నెక్లెస్ రోడ్డు వైపు నిమజ్జనానికి వెళ్తున్న భారీ గణనాథున్ని తరలించే వాహనం చెడిపోవడంతో త్యాగయ్య విగ్రహం వద్ద ఉదయం 6గంటల నుండి రోడ్డు మధ్యలోనే నిలిచిపోయింది. స్థానిక పోలీసులు ఉదయం 11 గంటల వరకు స్పందించకపోవడంతో ట్యాంక్‌బండ్‌పై రాకపోకలు సాగించే వాహనాలు, బస్సులతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు 5గంటల పాటు తామే ట్రాఫిక్‌ను మళ్లించేందుకు నానా ఇబ్బందులు పడ్డామని డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజ్‌గిరి నుంచి హుస్సేన్‌సాగర్ ట్యాంక్‌బండ్ నెక్లెస్ రోడ్డుకు ట్రాక్టర్ సాయంతో వినాయకుడిని తరలించే వాహనం ముందువైపు ఉన్న టైర్ విరిగిపోగా.. భారీ గణనాథుడు రోడ్డు మధ్యలో త్యాగయ్య విగ్రహం వద్ద నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మరో టస్కర్ వాహనం తీసుకువచ్చేంత వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి

అంబర్‌పేట: రాష్ట్రసాధనలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం బాగ్ అంబర్‌పేట్‌లో సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు రూబీ స్టీవెన్‌సన్, ప్రధాన కార్యదర్శి వెంకన్నలు మాట్లాడారు. ఉద్యమకారుల కుటుంబాలు నేడు దీనవస్థలో ఉన్నాయన్నారు. రాజకీయాలకు అతీతంగా అమరులైన కుటుంబాలకు నెలకు రూ. 5 వేల పెన్షన్ అందించాలన్నారు. సంక్షేమ సమితి నాయకులు రాంచందర్‌గౌడ్, శశిధర్ శిల్ప, బంగారి శ్రీనివాస్, జహంగీర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నల్లకుంటలో పూజలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి


కాచిగూడలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దండాలయ్య.. ఉండ్రాలయ్య

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో వినాయకుడికి విశేష పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం అపార్ట్‌మెంట్లు, కాలనీలు, ప్రధాన కూడలీలు, దేవాలయాలు మండపాల్లో ఏర్పాటు చేసిన వినాయకులకు రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. పూజలకు ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు హాజరై స్వామివారి ఆశీస్సులను పొందుతున్నారు.


ప్రొఫెసర్ కోదండరామ్, నరసయ్య తదితరులు


బర్కత్‌పుర పార్కులో ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు


తిలక్‌నగర్‌లో గణనాథుడి పూజలో ఈస్ట్ జోన్ డీసీపీ సునీల్‌దత్


దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, కె.సదానంద్


ఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి సజ్జనార్ తదితరులు


మానస ఎన్‌క్లేవ్‌లో..


దోమలగూడ పూల్‌బాగ్‌లో రూ.52 వేలు పలికిన లడ్డూ


రాంనగర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రూ.8.581 కోట్లు

అంబర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు గత 10 ఏళ్లలో రూ.8.581 కోట్లను ఖర్చు చేసిందని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. సీఎం కేసీఆర్ కృషితో మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. మంగళవారం అంబర్‌పేట మూసీ సమీపంలో ముస్లిం మైనార్టీల కోసం మూడెకరాల్లో నిర్మించనున్న శ్మశానవాటిక నిర్మాణానికి ఆయన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ ఉస్సేన్, మిర్జా రహేమాత్ బేగ్‌లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ...దశాబ్దాల కాలంగా నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీలు ఎదుర్కుంటున్న శ్మశానవాటిక సమస్య పరిష్కారాన్ని సవాల్‌గా తీసుకుని ఎమ్మెల్యే పరిష్కారించడం అభినందనీయమన్నారు. జీఎచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసీయుద్దీన్, కార్పొరేటర్లు విజయకుమార్‌గౌడ్, పద్మ, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ

ఉచితవైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. సత్యహోమియో క్లినిక్, ఔరా డెంటల్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా హాజరై కార్పొరేటర్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులు, డయాబెటీస్, బీపీ వంటి వాటికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ ఎన్.సాయికృష్ణ, డాక్టర్ సీహెచ్ రోహిత్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్, స్థానికులు ఎన్.రమానందగుప్తా, శ్యామ్‌ప్రసాద్, సాయి, సంతోష్, సంపత్ తదితరులున్నారు.

ముషీరాబాద్: రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్‌లో ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ లారా మీనన్, శ్రీదేవి విద్యార్థులకు జనరల్ చెకప్, హైట్, వేయిట్ తదితర పరీక్షలను నిర్వహించారు.

రూ.41 లక్షలతో అభివృద్ధి పనులు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో అధ్వానంగా మారిన రోడ్లను మోడల్ రోడ్లుగా మార్చుతున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని బర్దీపోచమ్మ దేవాలయం వీధిలో రూ.18 లక్షతో సీసీరోడ్లు, అరుణా కో-ఆపరేటివ్ సొసైటీ వీధిలో రూ.13 లక్షలతో సీసీరోడ్డు పనులు, శివాలయం వీధిలో రూ.10 లక్షలతో ఫుట్‌పాత్ నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ తదితర అభివృద్ధి పనులను స్థానిక ప్రజలు సామాజిక బాధ్యతతో కాపాడుకోవాలని సూచించారు. బీఆర్‌ఎస్ యువనేత ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, ఆకుల అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, సోమన్, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ఎయిర్‌టెల్ రాజు, బల్లా ప్రశాంత్, శోభ, మేరీ, బీజేపీ నేతలు ఎం.నవీన్‌గౌడ్, బద్రినారాయణ, అనిల్ కుమార్ తదితరులున్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలి

చిక్కడపల్లి: భారత స్వాతంత్ర్య పోరాట యోధుడు, తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న ప్రకటించాలని చిక్కాదేవదాసు చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం చిక్కడపల్లిలో ఆయన మాట్లాడుతూ.. నాటి నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాటం చేయడమే కాకుండా ఏడో నిజాంపై బాంబుదాడులు చేసి పోరాట ఉధృతి స్వభావాన్ని వ్యక్తపరిచిన తెలంగాణ యోధుడని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యజించిన గొప్ప వ్యక్తని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడి 9 ఏళ్లు గడిచినా సీఎం కేసీఆర్ బాపూజీ శృతివనం ఏర్పాటు చేస్తామని చెప్పి ఏర్పాటు చేయకపోవడం దారుణామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

పేద దళితులకు తీవ్ర అన్యాయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పేద వర్గాలకు చెందిన దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. డబుల్ బెడ్రూంల విషయంలో దళితులకు అన్యాయం జరిగిందని రాష్ట్రంలో 18 శాతం ఉన్న దళితులకు 6 శాతం కూడా ఇళ్లు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఎస్‌డీఎఫ్ అమలు తీరుతెన్నులపై సమావేశం నిర్వహించారు. స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. దళిత బంధు విషయంలో అసలైన పేదలకు చెందకుండా కొంతమంది తమక అనుకూలమైన వారికి మాత్రమే దళితబంధు వచ్చేలా చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. యాక్షన్ ఎయిడ్ ప్రతినిధి ఎం.ఆంజనేయులు, డాక్టర్ ఇర్ఫాన్, రామ్‌ప్రసాద్, ధర్మానాయక్, డాక్టర్ రవి, హరినాథ్, సంజీవ్, శివలింగం తదితరులున్నారు.

రైల్వే పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు

కాచిగూడ: రైల్వే పోలీస్ స్టేషన్‌లో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ నర్సయ్య ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మంగళవారం జరిగిన తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించి, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. విధి నిర్వహణలో రైల్వే పోలీసులు, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప చేస్తున్న కృషిని డీఎస్పీ ప్రశంసించారు.

నకిలీ హిజ్రా అరెస్ట్

ముషీరాబాద్: రాంనగర్ మీసేవా కేంద్రం పరిసర ప్రాంతంలో ఓ హిజ్రా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ.. అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని ముషీరాబాద్ పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేయగా.. పోలీసులు వచ్చి హిజ్రాను అరెస్టు చేశారు. హిజ్రాను విచారించగా తనపేరు నిషా అలియాస్ రమేష్ అని గుంటూరు జిల్లా తాడికొండ ప్రాంత వాసిగా చెప్పారు. హిజ్రా లాగా వేశం వేసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు అంగీకరించాడు. అతడి వద్ద రూ.435లను రికవరీ చేసి గాంధీ ఆసుపత్రిలో నకిలీ హిజ్రా అని నిర్ధారించారని ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ తెలిపారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చాలా మంది నకిలీ హిజ్రాలు పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. వీరిపట్ల అప్రమత్తంగా ఉండాలని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రోడ్లపై మద్యం సేవిస్తున్న ముగ్గురి రిమాండ్

ముషీరాబాద్: పట్టపగలే మోరంబోంద, పార్శిగుట్ట, తదితర బహిరంగ ప్రదేశాల్లో నడిరోడ్డుపై మద్యం సేవిస్తూ.. న్యూసెన్స్ చేస్తున్న ముగ్గురు వ్యక్తులను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాలనీ వాసులను, రోడ్డుపై వచ్చి పోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న నాని, నర్సింహ్మా, రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్ల వేతనాలు చెల్లించాలని వినతి

కాచిగూడ: రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 1940 గెస్ట్ లెక్చరర్లకు కన్సాలిడెటెడ్ వేతనం రూ.28,080 చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఆయన ఆధ్వర్యంలో తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చింతల కిషోర్‌కుమార్‌తో కలిసి ప్రతినిధుల బృందం మంగళవారం మంత్రి సబితాఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గెస్ట్ లెక్చరర్ల వేతనాలను గంటకు చొప్పున కాకుండా కన్సాలిడేటెడ్‌గా నెలకు ఇవ్వాలని, 2023-24 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయాలని కోరారు. జీవో నెంబర్ 212 ప్రకారం కనీస వేతనం జీవోను గెస్ట్ లెక్చరర్లకు అమలయ్యేలా చూడాలన్నారు. 2016-17 విద్యా సంవత్సరం నుంచి సీబీసీఎస్ సెమిస్టర్స్ పద్ధతిని అమలు చేస్తున్నందున సీబీసీఎస్ పరీక్షలు ప్రతి 6 నెలలకోసారి పరీక్షలు ఉంటాయన్నారు. దీంతో 12 నెలలు కళాశాలలు పనిచేస్తున్నందున గెస్ట్ లెక్చరర్లకు 12 నెలలకు వేతనాలు ఇవ్వాలన్నారు.


మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్

కేంద్రమంత్రికి ఆహ్వానం


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట: ఈనెల 28న నిర్వహించనున్న గణపతి నిమజ్జనం సందర్భంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తాలో స్వాగత వేదికను ఏర్పాటు చేస్తున్నామని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నల్లకుంట ప్రతినిధులు తెలిపారు. గంగమ్మ ఒడికి చేరేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున తరలి వచ్చే గణనాథులకు ఈ వేదిక ద్వారా స్వాగతం పలికేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవ సమితి నియోజకవర్గ కో-కన్వీనర్ సురేష్‌యాదవ్, స్వాగత వేదిక ప్రతినిధులు ఎస్.రామ్‌జగదీష్‌ముదిరాజ్, మాచర్ల అర్జున్, పాతకోటి మహేష్, మల్లికార్జున్ తదితరులు సోమవారం రాత్రి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు, కార్పొరేటర్లతో పాటు వివిధ పార్టీల నాయకులకు ఆహ్వానపత్రికలను అందజేశామన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని గణేష్ నవరాత్రి మండపాల నిర్వాహకులను కోరారు.

పర్యావరణ సమతుల్య లోపంతో సమస్యలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ సమతుల్య లోపంతో సమాజంలో అనేక సమస్యలు పెరిగిపోతున్నాయని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్‌రెడ్డి, పీ.శీ.నిరంజన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం సుందరయ్య పార్కులో అంతర్జాతీయ పర్యావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రూపొందించిన పర్యావరణ నినాదాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పర్యావరణ బలోపేతంతోనే మానవ సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు. అనేక వాతావరణ సమస్యలు మానవాళిని అతలాకుతలం చేస్తుందన్నారు. ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు సీ.హెచ్.రంగయ్య మాట్లాడుతూ.. మనిషి తన చుట్టూ పర్యావరణానికి నష్టం జరుగుతున్న పట్టించుకోకపోవడం వల్లే పర్యావరణం దెబ్బతింటుందన్నారు. దీంతో వాతావరణంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పర్యావరణవేత్తలు మన్నె దామోదర్‌రెడ్డి, నరహరి, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి

అంగన్‌వాడీల సమ్మెపై నిర్బంధం ఆపాలి


సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చట్టబద్ధం, శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రకటిస్తూ.. బెదిరింపులకు పాల్పడుతుందని కార్మిక సంఘాల నేతలు ఉమానాగేంద్రమణి, పాలడుగు భాస్కర్, జయలక్ష్మి, ఎస్‌ఎల్ పద్మ అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం నిర్బంధాన్ని తక్షణమే ఆపాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం ఇవ్వాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంపు తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నారని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి సమ్మెను విచ్ఛిన్నం చేయాలని కుట్ర చేస్తుందన్నారు. సమ్మెలో ఉన్న సంఘాలను చర్చలకు పిలవకుండా అప్రజాస్వామికంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని వారు విమర్శించారు. సమ్మెపై నిర్బంధాన్ని తక్షణమే ఆపాలని, సమ్మెలో ఉన్న సంఘాలతో చర్చలు జరిపి సామరస్యంగా సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు ఎం.విజయ్ కుమార్‌యాదవ్, ఎండి యూసుఫ్, బాల్‌రాజ్, భూపాల్, సూర్యం, ఎం.కె.బోస్, ఈశ్వర్‌రావు, పావని తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాత చాకలి ఐలమ్మ

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ పాల్గొని ఐలమ్మ సేవలను గుర్తు చేసుకుని ఆమె స్ఫూర్తిదాత అని కొనియాడారు.


బర్కత్‌పురలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు


ఎమ్మెల్యే ముఠాగోపాల్, రాజ్యసభ ఎంపీ కె.లక్ష్మణ్


రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్


నివాళులర్పిస్తున్న ఆనంద్‌గౌడ్ తదితరులు


పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న జోర్రిగల శ్రీధర్


ఫీవర్ చౌరస్తా వద్ద ఎమ్మెల్యే కాలేరు


బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సూర్యనారాయణశర్మ